చదివాలమూ. ఎంత నచ్చచెప్పినా ఫలితం లేకపోయింది. నేనుమాత్రం యమ్‌.కాంలో చేరాను. ఆ ఏడు అనుకోకుండ విజయ్ నాన్న గారికి హైదరాబాదు ట్రాన్స్‌ఫర్ కావడంతో మేమిద్దరం విడిపోవలసిన రోజు వచ్చింది. వాడు వెళ్లేరోజున ఎంత ఆపుకుందామన్నా నాకు దుఃఖం ఆగలేదు. వాడిని ఆఖరు సారిగా కావలించుకున్నప్పుడు కళ్లనీళ్ల పర్యంతమైంది. ఆ తర్వాత 'వాడిజీవితం ఏవిధంగా మలుపు తిరుగుతుందోనని నా భయం.

కొద్దిసేపట్లో రైలు కదులుతుందనగా అడిగాను, 'పెళ్లిఎప్పుడురా చేసుకుంటావు?' అని.

బలవంతంగా పెదాలమీద నవ్వు తెచ్చుకుని, 'చేసుకుంటాను కానీ ఎప్పుడో చెప్పలేను. నా మూలంగా మరోవ్యక్తి బాధపడే అవసరం తీసుకురాను. ఆ నిర్ణయం తీసుకునే ముందు నీకు చెబుతానుగా!' అన్నాడు.

ఆ శుభఘడియ అనేది వస్తే అందరికన్నా ఎక్కువగా సంతోషించేది నేనే!

రైలు కదులుతుంటే 'వాడి జీవితాన్ని సరిదిద్దే భారం ఇక నీదే భగవాన్' అని మనసులో కోరుకున్నాను.

విజయ్‌మాట ఎలా ఉన్నా, కవిత తీసుకున్న నిర్ణయాన్ని నేను సమర్థించలేకపోయాను. ఆవిడ పెళ్లిచేసుకుని హాయిగా ఉంది. వీడుమాత్రం కాలానికి బలి అయి ఇలా శవంలా జీవిస్తున్నాడు.

ఈ ఆడవాళ్లంతా ఇంతే!

మొదట ప్రాణప్రదంగా ప్రేమిస్తారు. ఆ తర్వాత ఏవేవో సాకులు చెప్పి తప్పించుకుంటారు. ఈ ప్రేమ, త్యాగం ఇవన్నీ ఆవేశం మాత్రమే!

మనసు రాయి చేసుకునైనా జీవితంతో రాజీపడిపోతారు కానీ తనను నమ్మి ప్రాణం పంచిన ఆ వ్యక్తి గతి ఏమౌతుందోననే ఆలోచనకూడ రానీకుండదు చేతికొచ్చిన నాలుగు నీతివాక్యాలు రాసి, అంతటితో వారి బాధ్యత తీరిపోయినట్లు చేతులు దులిపేసుకుంటారు.

నాకు కలిగిన ఈ అభిప్రాయాన్ని విజయ్‌కి చెబితే, వాడు కొంచెం బాధపడుతున్నట్లు, 'పరాయి ఆడవాళ్ల విషయమైతే నాకు తెలీదుగాని కవితమాత్రం ఆ జాబితాలోకి చేర్చకు. ఆమె మనసు చాలా నిర్మలమైనది అని నా ఒక్కడికే తెలుసు.' అనేవాడు.

ఇంత జరిగినా ఆ కవిత మీదున్న సదభిప్రాయం వీడినుండి సడలిపోలేదు,

విజయ్ పరిస్థితి కళ్లారా చూశాక ప్రేమంటే నాకు అసహ్యం వేసింది. వాడి ప్రేమ నాపాలిట ఆదర్శప్రాయంగా నిలిచింది. జీవితంలో ఏ అమ్మాయినీ ఏ పరిస్థితిలోనూ ప్రేమించకూడదు అనే నిర్ణయానికి వచ్చాను.

*  *  *

విజయ్ దూరమయ్యాక కొన్నాళ్ళు ఒంటరితనం నన్ను బాధించింది. క్రమేణా ఆ ఒంటరి తనానికే అలవాటు పడిపోయాను. మరోఆలోచన అనేది లేకుండా నాధ్యాస అంతా చదువుమీదికి మళ్లించాను. క్లాసులో ఎప్పుడూ రిజర్వ్‌డ్‌గా వుండేవాడిని. చదువు, ఇల్లు తప్పితే, బయట ప్రపంచం గురించి అంతగా పట్టించుకునేవాడిని కాదు. నాతోటి వాళ్లంతా నన్నుచూసి రకరకాలుగా చెప్పుకునేవారు. కొందరు నాకు గర్వం ఎక్కువనేవారు. మరికొందరు, 'వాడు ఆదోటైపురా' అనేవారు. ఇంకొందరయితే నావెనకాలే 'మోడర్నుగాంధిరోయ్' అని ఎగతాళి చేసేవారు.

క్లాసు అంతటికి నన్ను అర్థం చేసుకున్నది మధు ఒక్కడే! మధు అందరితోను కలుపుగోలుతనంగావుండేవాడు. పైకి ఎంత జాలీగావుంటాడో మనిషికూడ అంత మంచివాడు. మా ఇద్దరిమధ్య స్నేహం ఎలా ఏర్పడిందో గుర్తులేదు. మొదటి ఏడు గడిచేసరికి మేమిద్దరం చాలా సన్నిహితులమయి పోయాము.


ఒకరోజు వద్దంటున్నా మధు బలవంతాన వాళ్లఇంటికి తీసుకువెళ్లాడు. ఇల్లు చిన్నది అయినా పొందికగా ఉంది.

హాలుమధ్య చక్కగా అమర్చబడిన టీపాయ్ ఉంది. గోడలకు వ్రేలాడుతున్న త్రివర్ణచిత్రాలు ఆకర్షణీయంగా వున్నాయి. ఆ గదిలో ప్రతివస్తువు వుండవలసినచోటున వున్నాయని చెప్తుంది. లోపల విడిగా మరో రెండుగదులు వున్నాయి.

ఇద్దరం హాలుమధ్య కుర్చీల్లో కూర్చున్నాం. ఆ ఇంట్లో మరెవరూ వున్న అలికిడే లేదు! అంత ఇంట్లో మధు ఒక్కడే ఉంటున్నాడా?

ఆ విషయం అడగాలనుకునే లోపల మధు 'చెల్లీ!' అని పిలిచాడు.

'వస్తున్నా!' లోపలనుండి వినిపించిన ఆ తియ్యటి స్వరం ఎందుకో నాలో ఆత్రుతను రేపింది. ఎంత మాధుర్యం వుంది ఆ స్వరంలో!



ఆమె ముందుకు వస్తున్నదల్లా నన్ను చూసి కొంచెం తడబడింది.

మధు గట్టిగా నవ్వేస్తూ 'ఫర్వాలేదు రా అరుణ్! ఇతనెవరో తెలుసా? మిస్టర్ భాస్కర్! నా క్లాసుమేటు. ది మోస్ట్ బ్రిల్లియంట్! అప్పుడప్పుడు చెబుతుంటానే వీడిగురించే!'

ఆమె నాజూకైన చేతులు రెండూ జోడించి 'నమస్తే' అంది.

మళ్లీ మళ్లీ వినాలనేటట్టు ఎంత తియ్యని కంఠం! లేత గులాబీతో పోటీ పడుతున్న కోమలమైన ఆమె శరీరం! వెన్నెల చల్లదనాన్ని మురిపించే పెదవులపై సున్నితంగా వెలిసిన ఆ చిరునవ్వు!

విజయ్‌గాని ఆక్షణాన పక్కనుంటే అంత కన్నా చక్కగా వర్ణించేవాడు.

'భాస్కర్! ఈమె నాప్రియమైన సోదరి అరుణ్! యమ్మే స్సీ చదువుతుంది. నీ వెప్పుడూ చూసి వుండవులే! నీకు చదువు తప్పితే మరో ఆలోచన లేదుగా! అరుణ్ కూడ నీలాగే చాలా రిజర్వ్‌డ్. చదువుమీద దానికున్న శ్రద్ధకి అమ్మనాన్న దానికి సరస్వతీకుమారి అని పేరు పెట్టాల్సింది!' అని నవ్వుతూ అరుణవైపు తిరిగి, 'కాఫీ అయిందా?' అని అడిగాడు.

'అయిపోవచ్చింది!'

'కమాన్‌క్విక్! ఇవాళ భాస్కర్ మనకి గెస్టు! మూడుకప్పులు పట్రా! హరియప్'.

నేను అడగకుండా మధు చాలా విషయాలు చెప్పాడు.

ఆ ఇంట్లో తను, అరుణ మాత్రమే వుంటున్నారని, వుదయం, సాయంత్రము ఇల్లు వూడ్చటానికి, పాచిపని వగైరా చూడటానికి పనిమనిషి వుందని, కాఫీ, వంటా వగైరాలా అరుణే స్వయంగా చేస్తుందని. అరుణ ఇంటి పనుల్లో చాలా నేర్పరని, వాళ్లనాన్నగారు హైదరాబాద్‌లో ఏదో బిజినెస్ చేస్తున్నారని, హాస్టలులో తిండి పడుతుందో లేదోనని వాళ్ల నాన్నగారే స్వయంగా ఆ ఏర్పాట్లు చేసివెళ్లారని చెప్పాడు.

ఇంతలో అరుణ కాఫీలు తీసుకొచ్చింది. తనుకూడ మాతోబాటు కూర్చొని కాఫీ తీసుకుంది. ఆ కొద్దిక్షణాలు చూడకూడదు అనుకుంటూనే ఆమెవైపు చూడకుండా వుండలేక పోయాను.

ఆ రాత్రంతా నాకు నిద్ర పట్టలేదు.

# మా ఇద్దరి కథ

ఆ అరుణ రూపం నా కళ్లముందు మెదిలి కవ్విస్తున్నట్టు అనిపించింది. కాని ఆ మరుక్షణాన విజయ్ కొశ్చెన్ మార్కులా నాకు గుర్తుకొచ్చాడు.

'నేను అనుభవిస్తున్నది చాలదా?' అని నిలదీసి అడుగుతున్నట్టు అనిపించింది.

'లేదురా! విజయ్! ఈ ఆడవాళ్ల మీదున్న నమ్మకం నీ జీవితంలో రేపిన పెనుతుఫానుతోనే ఎగిరిపోయింది, అరుణను మరిచిపోతాను. నన్ను నేను నిగ్రహించుకుంటాను.' అని నాలో నేను నిశ్చయించుకుని బలవంతంగా నిద్రపోయాను.

* * *

విజయ్ నేనూ తరచూ సాయంత్రాలు బీచికి వెళ్లేవాళ్లం. ఆ మెత్తని ఇసుకలో కూర్చొని సరదాగా కబుర్లు చెప్పుకునేవాళ్లం! విజయ్ దూరమయ్యాక కూడ నాకు ఆ అలవాటు పోలేదు. ఆ చల్లని సముద్రపుగాలి మనసుకి ఎంతో ప్రశాంతత కలిగించేది.

చీకటి పడుతోంది. దూరాన అలలమీద చిందులాడే చందమామను చూస్తూ ఏదో ఆలోచనలో మునిగి పోయాను.

'హల్లో! భాస్కర్!'

ఉలిక్కిపడి పక్కకు చూశాను.

అరుణ!—లేత నీలిరంగు చీరతో ఆ అందమైన సాయంత్రాన్ని మరిపించేలా వుంది.

'మీరా!' కొంచెం తత్తర పడ్డాను.

'నన్నుచూసి జడుసుకోలేదుగా!' నవ్వుతూ అంది.

'నో నో! అదికాదు.'

'నాకు తెలుసులెండి! అన్నయ్య మీ గురించి చాలా చెప్పాడు. అమ్మాయి లంటే మీకు చాలా భయమటగా! నేనుకూడ మీ కంటికి అలానే కనిపిస్తున్నానా?'

ఆమె అమాయకత్వానికి నాకు అమాంతం నవ్వొచ్చింది.

'సిల్లీఫూల్! అలా చెప్పాడా వాడు. అమ్మాయిలంటే నాకు గౌరవం వుంది. కానీ ఇంతవరకు ఏ అమ్మాయితోను మాట్లాడే అవసరం లేకపోయింది. ఎవరిమాట ఎలా వున్నా మీరంటే నాకు అభిమానం!' తొందరలో ఏదో అన్నాను.

'మీ అభిప్రాయం చప్పగా వుంది. నన్ను చూస్తే కేవలం అభిమానం తప్ప ఇంకే అభిప్రాయం కలగలేదా మీకు?' అమాయకంగా అడిగినా అర్థం ధ్వనించింది.

ఆమె అడిగిన దానికి నేను జవాబు చెప్పలేదు. సంభాషణ మరో విషయం పైకి మళ్లించాను.

ఇంకా కొంతసేపు అక్కడే వుంటే నా మనసు స్వాధీనం తప్పుతుందేమోనని భయం కలిగింది. మెల్లగా లేచి నిల్చున్నాను. కొంతదూరం అనుసరించి ఆమె అయిష్టంగా ఇంటికి దారితీసింది.

ఆ తర్వాత అరుణ చాలాసార్లు కలిసింది. ప్రతి ఆదివారం లైబ్రరీకి వచ్చేది. తరచూ బీచ్‌లో కలిసేది. నాతోవున్న పరిచయాన్ని ప్రేమగా రూపొందించాలని ఎంతో ఆశపడేది. కాని బలవంతాన ఆమె ఆశను ఆశగానే మిగిల్చి వేశాను.

అరుణలో అందముంది, చదువుతోబాటు సంస్కారముంది. మాటల్లో మృదుత్వము, చూపుల్లో చల్లదనం, చిరునవ్వులో వెన్నెల హాయి వున్నాయి. ఇంకా ఆమెలో ఎన్నో ఉత్తమ ఆదర్శాలు వున్నాయి. అటువంటి అరుణ తన సర్వస్వాన్ని అర్పించడానికి ముందుకు వచ్చినా నేను స్వీకరించలేక పోయాను.

నా మనసు ఈ జన్మలో మారదేమో!

ఈ రోజు అమృతం కురిపించి హృదయ పీఠాన్ని అలంకరించవలసిన ఈ అరుణే రేపు ఎడారి మధ్య ఒంటరిగా వదిలినట్టు దూరంగా వెళ్లిపోతుంది. ఈ ప్రేమ, త్యాగం లేశమాత్రమైనా గుర్తుండవు. విళ్లకు చిగుళ్లు తొడిగే వసంతమూ, గలగల పారే సెలయేరు, నీటి అలలమీద నాట్యంచేసే చందమామ ఇవన్నీ ఎప్పటికీ గుర్తుంటాయి. కాని నీవు గుర్తుంటావనే గ్యారంటీ లేదు, ప్రేమించడం, తృణీకరించడం అంతా వీళ్ల ఇష్టమే!

విజయ్ జీవితం ఏమయింది? ఎంత ప్రాణప్రదంగా ప్రేమించాడు. నిశ్చలంగా ప్రవహించే ఆ జీవన వాహినిలో ఆనాడు సంచలనం రేగియుండకపోతే వాడి జీవితం ఈనాడు అర్థంలేని నిర్వచనంగా మిగిలి పోయేది కాదు!

ఈ ఆలోచనలన్నీ నా మనసుని ఒక కఠినశిలగా మార్చివేశాయి!

* * *